# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 7-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:212 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణ సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

**-మే 14వ తేదీ నుంచి ఆన్ లైన్ దరఖాస్తులు ప్రారంభం**

**- ఆగస్టు 28 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు**

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ సెట్ 2024 నోటిఫికేషన్ విడుదలైంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ల ఉద్యోగాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్ష కోసం సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి నోటిఫికేషన్ ను విడుదల చేశారు. మే 14వ తేదీ నుంచి ఆన్ లైన్ దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. జూలై 2వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఫైన్ తో జూలై 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆగస్టు 20వ తేదీ నుంచి సెట్ హాల్ టికెట్లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఆగస్టు 28 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కాగా, ఈ పరీక్షలో 2 పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు.. పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయి. కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో 3 గంటల పాటు పరీక్ష నిర్వహించనున్నారు.

### చురక

నలుపేదో తెలిపేదే
నిగ్గుతేల్చే నిజం తీర్పు
ఎన్నికల్లో లేకపోతే
ఎన్నటికీ రాదు మార్పు.

కులం మతం డబ్బు ఎర
క్షణికమైన భ్రమల తెర
బయటపడి తెంచకుంటే
బ్రతుకంతా ఎతల చెర



-వేల్పుల నారాయణ

## హిమాచల్ ప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ యొక్క 7వ కాన్వొకేషన్‌కు భారత ప్రెసిడెంట్ గ్రేస్



న్యూఢిల్లీ, మే 6:ఈరోజు (మే 6, 2024) ధర్మశాలలో జరిగిన హిమాచల్ ప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ 7వ స్నాతకోత్సవంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ మార్పు అనేది ప్రకృతి ధర్మమని అన్నారు. కానీ, మార్పుల వేగం గతంలో అంత వేగంగా లేదు. నేడు మనం 4వ పారిశ్రామిక విప్లవ యుగంలో ఉన్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి కొత్త రంగాలు వేగంగా పుట్టుకొస్తున్నాయి.

మార్పు యొక్క వేగం మరియు పరిమాణం రెండూ చాలా ఎక్కువగా ఉంటాయి, దీని కారణంగా సాంకేతికత మరియు అవసరమైన నైపుణ్యాలు చాలా త్వరగా మారుతున్నాయి. 21వ శతాబ్దం ప్రారంభంలో, రాబోయే 20 లేదా 25 సంవత్సరాల్లో ప్రజలకు ఎలాంటి నైపుణ్యాలు అవసరమో ఎవరికీ తెలియదు. అదేవిధంగా, అనేక ప్రస్తుత నైపుణ్యాలు భవిష్యత్తులో ఉపయోగపడవు. అందువల్ల, మనం నిరంతరం కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాలి. యువ తరం వేగంగా జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ఉండేలా అనువైన మనస్సులను అభివృద్ధి చేయడంపై మన దృష్టి ఉండాలి. 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు విద్యార్థుల్లో ఉత్సుకతను, నేర్చుకోవాలనే తపనను బలోపేతం చేయాలి.

ఉపాధ్యాయులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ విద్యార్థులకు విద్యాబోధనతో పాటు స్వావలంబనతో పాటు వారి వ్యక్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని నిర్మించేలా విద్య ఉండాలని అన్నారు. విద్య యొక్క లక్ష్యం విద్యార్థులలో వారి సంస్కృతి, సంప్రదాయం మరియు నాగరికతపై అవగాహన తీసుకురావడం కూడా. ఈ విషయంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆమె ఉద్ఘాటించారు. వారి పని పరిధి కేవలం బోధనకు మాత్రమే పరిమితం కాదు, దేశ భవిష్యత్తును నిర్మించే బృహత్తర బాధ్యత వారిపై ఉంది.

'ఏం నేర్చుకోవాలి' అలాగే 'ఎలా నేర్చుకోవాలి' అనే అంశంపై కూడా మన దృష్టి ఉండాలని రాష్ట్రపతి అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వతంత్రంగా నేర్చుకుంటే వారిలోని సృజనాత్మకత, ఊహాశక్తి పెరుగుతాయని ఆమె నొక్కి చెప్పారు. అలాంటప్పుడు వారు విద్యను కేవలం జీవనోపాధికి పర్యాయపదంగా పరిగణించరు. బదులుగా, వారు ఆవిష్కరణలు చేస్తారు, సమస్యలకు పరిష్కారాలను కనుగొంటారు మరియు ఉత్సుకతతో నేర్చుకుంటారు.

విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ, ప్రతి వ్యక్తికి మంచి మరియు చెడు రెండింటికీ అవకాశం ఉంటుందని అన్నారు. ఎంతటి క్లిష్టపరిస్థితుల్లో ఉన్నా తమపై చెడు ఆధిపత్యం చెలరేగకూడదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆమె వారికి సూచించారు. వారు ఎల్లప్పుడూ మంచి వైపు తీసుకోవాలి. కరుణ, చిత్తశుద్ధి, సున్నితత్వం వంటి మానవీయ విలువలను ఆదర్శంగా తీసుకోవాలని ఆమె వారిని కోరారు. ఈ విలువల ఆధారంగా వారు విజయవంతమైన మరియు అర్థవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఆమె అన్నారు.

యువతకు ఎదగడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని రాష్ట్రపతి అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క సంకల్పాన్ని నెరవేర్చడానికి అవి చాలా ముఖ్యమైన లింక్. అందుకే జాతికి అంకితం కావాలి. ఇది వారి మానవ, సామాజిక మరియు నైతిక బాధ్యత మాత్రమే కాదు, పౌరులుగా వారి కర్తవ్యం కూడా.

## ఈ ఎన్నికలలో ఒక్క సీటైనా గెలుస్తారా? కెసిఆర్ ను నిలదీసిన ఉప ముఖ్యమంత్రి భట్టి

ఖమ్మం, మే 6(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం ఎంపిగా బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న నామా నాగేశ్వర రావు ఏ పార్టీ నుంచి మంత్రి అవుతారు? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఒక్క సీట్ కూడా గెలవని బీఆర్ఎస్ నుంచి నామా ఎలా మంత్రి అవుతారని కెసిఆర్ ను నిలదీశారు.. ఖమ్మంలో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో అడ్రస్ వుండదన్నారు. కార్ షెడ్ నుంచి ఇక బయటకు రాదన్నారు.

కాంగ్రెస్ గతంలో ఎలా సేవ చేసింది భవిష్యత్ లో కూడా అలా సేవ చేస్తామన్నారు భట్టి. 1400 కోట్ల తో పూర్తి కావల్సిన ప్రాజెక్టు లను వేల కోట్లు వెచ్చించి ఒక్క చుక్క నీరు రాకుండా చేసిన చరిత్ర కేసీఆర్ ది అన్నారు. తాము మాత్రం కృష్ణా జలాలతో పాటు గోదావరి జలాలు కూడా అందిస్తామన్నారు.

ధనిక రాష్ట్రంను మీ చేతిలో పెడితే ఒక్క నెల కూడా మొదటి నెల జీతం ఇవ్వలేని ప్రభుత్వం మీదని కేసీఆర్ చేసిన విమర్శలు స్పందిస్తూ, తాము అధికారం లోకి వచ్చిన దగ్గర నుంచి అందరికీ జీతాలు ఇస్తున్నామన్నారు. కాకి అరిచినట్లు గా రైతు బందు ఇవ్వలేదు అని అంటున్నారని తెలిపారు. సోయి వుండి మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు.

ఇప్పటికే 65 లక్షల మందికి రైతు బందు వేశామని, మిగిలిన వారికి వేస్తున్నామన్నారు. అబద్దాల పునాదుల మీద బ్రతికిన బీఆర్ఎస్ అధికార పార్టీ మీద బురద చల్లడం కేసీఆర్ లక్ష్యం అన్నారు. బాష మార్చుకో కేసీఆర్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిగ్గులేకుండా మాజీ ముఖ్యమంత్రి హోదా లో ఏమిటా మాటలు అన్నారు. దద్దమ్మలు, సన్నాసులు అంటే చూస్తూ ఊరుకోమన్నారు. కెసిఆర్ చేసిన దోపిడీ సొమ్ము తోటే తాము గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. కోడ్ పూర్తి కాగానే ఇందిరమ్మ ఇళ్ల కు శంఖుస్థాపనలు చేస్తామన్నారు.

## నవీన్‌పై మోదీ ఫైర్.. ఒడిశాను దోచేశారని ఆగ్రహం

**-అప్పుడు కాంగ్రెస్, ఇప్పుడు బీజేడీ**

**-ఒడిశా వెనుకబాటుకు కారణం ఆ పార్టీనే**

**-బీజేడీలో అందరూ అవినీతిపరులే**

**-అభివృద్ధికి కేటాయింపులు చేయని ప్రభుత్వం**

**-10 ఏళ్లలో ఒడిశాకు 3.50 లక్షల కోట్లు ఇచ్చాం**

**-10 ఏళ్లలో నవీన్.. పట్నాయక్‌ను ఒక్క మాట అనని మోదీ**

**-ఎన్నికల నేపథ్యంలో ఫ్రెండ్లీ పార్టీపై గరం గరం**

**-నేడు ఏపీలోని రాజమండ్రి, అనకాపల్లిలో మోదీ సభలు**

**-హాజరుకానున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్**

ఒడిశా, మే 6: : నాడు కాంగ్రెస్ పార్టీ ఒడిశా రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంటే, నేడు బీజేడీ కూడా అదే పని చేస్తోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. రాష్ట్రంలోని సహజ వనరులను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. పుష్కలంగా నీళ్లు, సారవంతమైన భూములు, విస్తారమైన తీర ప్రాంతం, ఘనమైన చరిత్ర, సంస్కృతి.. ఇలా ఒడిశాకు దేవుడు అన్నీ ఇచ్చాడు కానీ ఇక్కడి పాలకుల తీరు వల్ల రాష్ట్రం ఇప్పటికీ వెనుకబడే ఉందని విమర్శించారు.

బీజేడీ నేతలు.. అవినీతిపరులు..

ఒడిశాలోని గంజాంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ.., బిజు జనతా దల్ (బీజేడీ) నేతల అవినీతి, అక్రమాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. బీజేడీకి చెందిన చోటామోటా లీడర్ కూడా పెద్ద పెద్ద బంగళాలు కట్టుకున్నారని ఆరోపించారు.. రాష్ట్రంలోని చాలా ఆసుపత్రుల్లో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఎందుకు ఉన్నాయని, వైద్యుల నియామకం ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. చిన్నారులు మధ్యలోనే చదువుకు దూరమయ్యే పరిస్థితి ఎందుకు నెలకొందని నిలదీశారు.

అభివృద్ధికి నిధులెక్కడ..

అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర బడ్జెట్?లో నిధులు కేటాయించకపోవడమేనని విమర్శించారు ప్రధాని. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒడిశాను చిన్నచూపు చూసిందని అంటూ గతంలో మన్మోహన్ సర్కారు పదేళ్లలో ఒడిశాకు కేవలం ?1 కోట్లు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. అదే పదేళ్ల ఎన్డీఏ హయాంలో కేంద్ర బడ్జెట్ లో ఒడిశాకు 3.5 లక్షల కోట్లు కేటాయింపులు జరిగాయని వివరించారు. నిరుపేద మహిళలు గర్భం దాల్చిన సమయంలో కేంద్ర సర్కారు రూ.6 వేలు ఆర్థిక సాయం చేసేందుకు ప్రవేశ పెట్టిన స్కీమ్ ను బీజేడీ సర్కారు రద్దు చేసిందని ఆరోపించారు.



ఫ్రెండ్లీ ఫైట్ ..

తమకు, బీజేడీ మధ్య ఒడిశాలో ఫ్రెండ్లీ ఫైట్ మాత్రమే ఉంటుందని ఒడిశా బీజేపీ నేతలు గతంలో చాలాసార్లు చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ బీజేడీ చీఫ్, సీఎం నవీన్ పట్నాయక్ పై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేయలేదు. ఆ పార్టీ నేతలు కూడా సంయమనం పాటించారు. దీనికి విరుద్ధంగా ప్రధాని మోదీ సోమవారం పట్నాయక్ పై తీవ్ర విమర్శలు చేశారు. దీంతో అక్కడ బిజెడిలో కలకలం బయలుదేరింది.. కాగా, సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఒడిశాలోని 147 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్ సభ నియోజకవర్గాల్లో మే 13 నుంచి మొత్తం నాలుగు దశల్లో పోలింగ్ జరగనుంది.

## రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగిస్తాం: రాహుల్ గాంధీ

భూపాల్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కుల ఆధారిత రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం గరిష్ఠ పరిమితిని తొలగించి దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులకు రిజర్వేషన్ల కోటాను కాంగ్రెస్ పెంచుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని రత్లాంలో ఒక ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఈ ఎన్నికల్లో పోరాడుతున్నామని చెప్పారు. రాజ్యాంగాన్ని అంతం చేయాలని, మార్చాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ ఆలోచిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. జల (నీరు), జంగల్(అడవులు), జమీన్ (భూమి)పై రాజ్యాంగం మీకు హక్కు ఇచ్చిందని, ఆ హక్కులను తొలగించాలని, సంపూర్ణ అధికారం తన వద్దనే ఉంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారని చేతిలో రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని రాహుల్ ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బిజెపి నాయకులు చెబుతున్నారని ఆయన అన్నారు. ఈ కారణంగానే 400కి మించి సీట్లు కావాలంటూ బిజెపి నాయకులు నినాదాలు ఇస్తున్నారని, అయితే 400 మాట అటుంచి కనీసం 150 సీట్లు కూడా ఆ పార్టీకి రావని ఆయన జోస్యం చెప్పారు. రిజర్వేషన్లు తొలగిస్తామని వారు అంటున్నారని, కాని 50 శాతానికి మించి మీకు రిజర్వేషన్లు పెంచుతామని తాను ఈ వేదిక నుంచి హామీ ఇస్తున్నానని రాహుల్ తెలిపారు. పేదలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీలకు అవసరమైన మేరకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఆయన తెలిపారు. ఆదివాసీలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించిన వార్తలను మీడియా చూపించదని ఆయన ఆరోపించారు. మీ పిల్లలను అత్యాచారం చేస్తారు..మీ భూమిని లాక్కుంటారు..కాని మీడియా ఈ వార్తలను రాయదు. ఇందుకు కారణం ఉంది. ఈ మీడియా కంపెనీలలో ఆదివాసీలు లేరు అని రాహుల్ ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వాన్ని 90 మంది బ్యూరోక్రాట్లు నడుపుతున్నారని ఆయన చెప్పారు. బడ్జెట్‌లను వారే పంపిణీ చేస్తారు. 90 మందిలో ఒకరే ఆదివాసీ. ముగ్గురు వెనుకబడిన తరగతులకు చెందిన వారు. దళిత వర్గాలకు చెందిన వారు ముగ్గురు. మీకు చెందిన వారు మీడియాలో కాని కార్పొరేట్ ప్రపంచంలో కాని లేరు. దీన్ని మార్చాలని మేము భావిస్తున్నాము. అందుకే కులగణన, ఆర్థిక సర్వే జరిపించాలని నిర్ణయించుకున్నాము అని రాహుల్ తెలిపారు. రైతులకు వారి పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని, రుణ మాఫీ చేస్తామని ఆయన వాగ్దానం చేశారు. తాము ఇస్తున్న హామీలు ఇవేనని, వీటితో మీ జీవితాలు మార్చివేస్తామని ఆయన ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల నాలుగవ దశలో మే 13న రత్లాంలో పోలింగ్ జరగనున్నది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కాంతిలాల్ భూరియా పోటీ చేస్తుండగా బిజెపి తరఫున అనితా నగర్ సింగ్ చౌహాన్ పోటీ చేస్తున్నారు.

## ఏపీ అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కారు ఉండాలి.. మోడీ

అమరావతి, మే 6:ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కారు ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ? 'గోదావరి మాతకు ప్రణామాలు.. ఈ నేల మీదే ఆదికవి నన్నయ్య తొలి కావ్యం రాశారు. ఇక్కడి నుంచే ఇప్పుడు కొత్త చరిత్ర లిఖించబోతున్నాం' అంటూ మోదీ తెలుగులో తన ప్రసంగం ప్రారంభించారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

"వైకాపా ప్రభుత్వం అవినీతిని జెట్ స్పీడ్‌తో పరిగెత్తించింది. అభివృద్ధి సున్నా.. అవినీతి వందశాతం. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని పూర్తిగా తిరస్కరిస్తారు. రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే ప్రభుత్వం ఉండాలి. వైకాపా సర్కారు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఈ రాష్ట్రం ప్రతిభావంతులైన యువతకు నెలవు. టెక్నాలజీలో ఏపీ యువత శక్తిని ప్రపంచం గుర్తించింది. దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో రాష్ట్రం కూడా అంతే స్పీడ్‌తో అభివృద్ధి చెందాలి. కానీ, కేంద్ర ప్రాజెక్టుల అమలును రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేసింది.

డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు పూర్తి అప్రమత్తంగా ఉండాలి. పదేళ్ల క్రితం దేశాన్ని కాంగ్రెస్ పార్టీ అధోగతి పాలు చేసింది. ఈడీ.. ఈడీ.. అంటూ ఇండియా కూటమి గగ్గోలు పెడుతోంది. కాంగ్రెస్ నేతల వద్ద గుట్టల కొద్దీ డబ్బు బయట పడుతోంది. ఆ పార్టీ నేతల డబ్బును మెషీన్లు కూడా లెక్కపెట్టలేకపోతున్నాయి"

మూడు రాజధానుల పేరిట ఏపీని లూటీ చేశారు..

"మూడు రాజధానులు చేస్తామన్నారు.. చేయలేదు కానీ, మూడు రాజధానుల పేరిట ఏపీని లూటీ చేశారు. ఏపీలో మద్యం నిషేధిస్తామని అధికారంలోకి వచ్చిన వైకాపా.. గద్దె నెక్కిన తర్వాత మద్యం సిండికేట్‌గా తయారైంది.

వైకాపా ప్రభుత్వానికి అవినీతి నిర్వహణ తప్ప.. రాష్ట్ర ఆర్థిక నియంత్రణ తెలియదు. రాష్ట్ర ఖజానాను వైకాపా ఖాళీ చేసింది. పోలవరం కోసం కేంద్రం రూ.15వేల కోట్లు ఇచ్చింది. కానీ, ఆ ప్రాజెక్టును ఈ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. రాజధానికి కేంద్రం రూ.15వేల కోట్లు ఇవ్వాలనుకుంది.

కానీ, కేంద్రం నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందుకోలేక పోయింది. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక చరిత్ర ఉన్న భూమి. రాముడి చరిత్రను సినిమాల ద్వారా ఎన్టీఆర్ ఇంటింటికీ తీసుకెళ్లారు. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠను

కాంగ్రెస్ బహిష్కరించింది. ఆ కార్యక్రమానికి వచ్చిన ఒక నేతను కాంగ్రెస్ బహిష్కరించింది. దిల్లీ-ముంబయి కారిడార్ మాదిరి విశాఖ-చెన్నై కారిడార్ నిర్మాణం చేపడతాం. చెన్నై-కోల్‌కతా హైవే, రాజమహేంద్రవరం విమానాశ్రయం ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మారుస్తాయి. ఏపీకి మోదీ గ్యారంటీ, చంద్రబాబు నేతృత్వం, పవన్ విశ్వాసం ఉన్నాయి. కూటమి అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం కూటమికి ఓటేయండి " అని మోదీ విజ్ఞప్తి చేశారు.

## పథకాల నిధులు విడుదలకు ఈసీ నో..

హైదరాబాద్, మే 6:ఎన్నికల వేళ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పథకాలకు నిధులు విడుదల చేసేందుకు ఎన్నికల సంఘం రెడ్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల నిధుల విడుదలకు అనుమతించాలన్న ప్రభుత్వ అభ్యర్థనకు ఎన్నికల సంఘం అనుమతి నిరాకరించింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇన్ పుట్ సబ్సిడీ పంపిణీతోపాటు పంట నష్టపరిహారం చెల్లించేందుకు కూడా ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వలేదు. ఎన్నికల నేపథ్యంలో ఈసీ అనుమతి నిరాకరించడంతో ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలకు బ్రేక్‌పడింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగనున్నాయి. కాగా, ఈ నెల 13న ఏపీలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. జూన్ 4వ తేదీన ఫలితాలు విడుదల కానున్నాయి.

## జగిత్యాలలో గురువు జైశెట్టి రమణయ్య ఇంటికి వెళ్లిన కేసీఆర్

జగిత్యా, మే 6: : జగిత్యాలలో తన గురువు, ప్రముఖ కవి, రచయిత జైశెట్టి రమణయ్య ఇంటికి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్లారు. కేసీఆర్ సిద్దిపేటలో ఇంటర్ చదువుకునే రోజుల్లో హిస్టరీ సబ్జెక్ట్ చెప్పిన గురువు జైశెట్టి రమణయ్య. అనారోగ్యంతో బాధపడుతున్న రమణయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులతో కేసీఆర్ మాట్లాడారు.

బస్సు యాత్రలో భాగంగా జగిత్యాలలో బస చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, స్థానికంగా నివాసం ఉంటున్న తన చిన్న నాటి గురువు ప్రముఖ కవి జైశెట్టి రమణయ్య వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. వయోభారంతో అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న వారిని కేసీఆర్ పరామర్శించారు.

ఈ సందర్భంగా తాను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో సిద్దిపేట జూనియర్ కాలేజీలో హిస్టరీ లెక్చరర్ గా తనకు చరిత్ర పాఠాలు నేర్పిన నాటి జ్ఞాపకాలను కేసీఆర్ నెమరు వేసుకున్నారు.

ఇంతింతై వటుడింతయై అన్నట్టుగా ఎదిగిన తన ప్రియ శిష్యుణ్ణి చూసిన గురువు రమణయ్య ఎంతగానో సంబురపడ్డారు. తెలంగాణ ప్రజల పట్ల ఆనాటి నుంచి కేసీఆర్ కున్న శ్రద్ధను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. సిద్దిపేట జిల్లా కావాలని 30 ఏండ్ల కిందనే కేసీఆర్ నాటి కేంద్ర మంత్రికి వినతిని అందించిన విషయాన్ని గురువు రమణయ్య గుర్తు చేశారు. ప్రజలను చైతన్యం చేసి ఉద్యమానికి నాయకత్వం వహించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత నీదేనని తన శిష్యుడు కేసీఆర్ ను కొనియాడారు. సాధించిన రాష్ట్రాన్ని అనతి కాలంలోనే



అభివృద్ధి చేసి తెలంగాణ ఔన్నత్యాన్ని దేశంలో నిలిపావని మెచ్చుకున్నారు.

కష్టాలను నష్టాలను సుఖాలను బాధలను జయాలను అపజయాలను సమ స్థితిలో స్వీకరించడం కేసీఆర్ కు చిన్ననాటి నుండీ అలవాటేనని అదే ఆయన విజయాలకు మూలమని, అదే స్థిత ప్రజ్ఞతను కొనసాగిస్తూ భవిష్యత్తులో విజయాలు సాధిస్తూ తెలంగాణ ప్రజల కన్నీళ్లు తూడ్చడంలో ముందుండాలని, తెలంగాణ ప్రజల సంక్షేమానికి ఇంకా చాలా చేయాల్సి ఉన్నదని తన శిష్యునికి రమణయ్య ఉద్బోధించారు. తనను పరామర్శించడానికి వచ్చిన శిష్యుడు కేసీఆర్ తో పావుగంట పాటు ఇష్టాగోష్టి కొనసాగించారు. అనంతరం గురువు వద్ద మరోసారి ఆశీర్వాదం వీడ్కోలు తీసుకుని తన పదమూడో రోజు బస్సు యాత్రను కొనసాగించేందుకు కేసీఆర్ ముందుకు కదిలారు.

## ఎక్స్‌ప్రెస్ మంత్లీ సీజన్ టికెట్ పాసుదారులకు టీఎస్ ఆర్టీసీ శుభవార్త

హైదరాబాద్ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఎక్స్ ప్రెస్ మంత్లీ సీజన్ టికెట్ పాసుదారులకు టీఎస్ ఆర్టీసీ శుభవార్త తెలిపింది. ఈ పాస్ ఉన్న వారు ఇప్పటి వరకు కేవలం ఎక్స్ ప్రెస్, ఆర్డీనరి బస్సుల్లో మాత్రమే ప్రయాణించడానికి వీలుండేది. తాజాగా ఈ పాస్ కలిగి ఉన్న వారు డీలక్స్ బస్సుల్లోనూ ప్రయాణించే వెసులుబాటును టిఎస్ ఆర్టీసీ కల్పించింది. రూ.20 కాంబినేషన్ టికెట్ తీసుకొని డీలక్స్ బస్సుల్లో వారు ప్రయాణించవచ్చు. ఎక్స్ ప్రెస్ పాసుదారులకు మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుందని ఆర్టీసి ఎండి సజ్జనార్ ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా తెలిపారు. కాగా ఈ కాంబినేషన్ టికెట్ సదుపాయాన్ని వినియోగించుకొని డీలక్స్ బస్సుల్లో ప్రయాణించాలని ఆయన సూచించారు. 100 కిలోమీటర్ల పరిధిలో జారీ చేసే ఈ పాస్ కావాలనుకునే వారు టిఎస్ ఆర్టీసికి చెందిన స్థానిక బస్‌పాస్ కౌంటర్లను సంప్రదించాలని ఎండి సూచించారు. తాజా నిర్ణయంతో నెల పాసు వాడే వారికి భారీ ఉపశమనం కలిగినట్లైంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్రీ బస్ వల్ల ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో నిలబడటానికి కూడా చోటు దొరకడం లేదు.

### నేటి కందం- నేటికీ అందం

ధ్యానముతో యోజనతో
మానితమగు మార్కెటింగు మంత్రము తోడన్
సోనీ కార్పోరేషను
రాణించుచునుండె జగతి లాభమ్ములతోన్

(7-5-1946 పెద్ద వ్యాపార సంస్థ సోనీ ప్రారంభమైన రోజు)



-రాధశ్రీ

సెల్:9494481210

## ఢిల్లీ లిక్కర్ కేసులో ఎంఎల్సీ కవితకు మళ్లి చుక్కెదురు

**- బెయిల్ నిరాకరించిన స్పెషల్ కోర్టు**

న్యూ ఢిల్లీ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఢిల్లీ లిక్కర్ కేసులో ఎంఎల్సి కవితకు చుక్కెదురైంది. కవితకు స్పెషల్ కోర్టు బెయిల్ నిరాకరించింది. ఇడి, సిబిఐ కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. గత నెలలో రెండు పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితను ఇడి అధికారులు మార్చి 15న అరెస్ట్ చేసిన సంగతి విదితమే. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఆమె, తనకు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా రౌస్ అవెన్యూ కోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కవితతో పాటు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, అనేక మంది మద్యం వ్యాపారస్తులు అరెస్టయ్యారు. అరవింద్ కేజ్రీవాల్ మార్చి 21న అరెస్టయ్యారు. ఆయన బెయిల్ కోసం అర్జీ పెట్టుకోగా ఢిల్లీ హైకోర్టు ఏప్రిల్ 9న కొట్టేసింది. లోక్ సభ ఎన్నికల వేళ తనపై రాజకీయ కక్ష సాధిస్తున్నారన్న ఆయన వాదనను కోర్టు తిరస్కరించింది. అయితే శుక్రవారం సుప్రీం కోర్టు కేజ్రీవాల్ వినతి విషయంలో స్పందించింది.

# శారీరక మానసిక ఆరోగ్య సిద్ధికి ఉపవాస పద్ధతులు !

## (06 మే "అంతర్జాతీయ ఉపవాస లేదా నిరాహార దినం" సందర్భంగా)

శారీరక ఆరోగ్యంతోనే మానసిక ఉల్లాసం సిద్ధిస్తుందని మనకు తెలుసు. శారీరక ఆరోగ్య సంరక్షణకు అనేక పద్ధతులను, జీవన విధానాలను అలవర్చుకుంటున్నాం. శారీరక వ్యాయామం, యోగాప్రాణాయామాలను నిత్య దినచర్యల్లో భాగం చేసుకుంటున్నాం. శారీరక మానసిక ఆరోగ్య సిద్ధికి మనం తీసుకునే ఆహారం కూడా ప్రధాన భూమికలను నిర్వహిస్తున్నాయని తెలుసు కోవాలి. నిత్యం పోషకాహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో నిరాహార లేదా ఉపవాసాలను దీక్షగా పాటించడం కూడా అంత కన్న ఉత్తమం. మన ఆరోగ్య సౌభాగ్యాలను కాపాడాలనే సదుద్దేశంతో మన సనాతన ధర్మం దేవుడి పూజలో భాగంగా వారానికి కనీసం ఒక రోజు ఉపవాసం లేదా నిరాహార దీక్షలో ఉండేలా సూచించింది. బరువు పెరగడం, జీవనశైలి వ్యాధుల బారిన పడడానికి ప్రధాన కారణాలుగా విచక్షణ మరిచి తిండి తినడం, అదుపు తప్పి ఫాస్ట్ ఫుడ్స్ లేదా జంక్ ఫుడ్స్ తీసుకోవడం లాంటివి దోహదపడుతున్నాయని తెలుసుకోవాలి.

### అంతర్జాతీయ నిరాహార లేదా ఉపవాస దినం-2024 నినాదం:

బరువును అదుపులో పెట్టుకోవడం, కొవ్వును కరిగించడం, శారీరక ఆరోగ్యానికి పునాదులు వేయడం, ప్రమాదకర ఆహారపు అలవాట్లు లాంటి అంశాల పట్ల అవగాహన కల్పించడానికి యూకె మహిళ 'మేరీ ఇవాన్స్' చొరవతో 1993 నుంచి ప్రతి ఏట 06 మే రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ నిరాహార లేదా ఉపవాస దినం (ఇంటర్నేషనల్ నో డయట్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. మూఢనమ్మకాలకు మంగళం పాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యాల పరిరక్షణకు వారానికి ఒక సారి నిరాహార లేదా ఉపవాసాలను పాటించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శరీర సానుకూలత (బాడీ పాసిటివిటి) సూత్రాలు, పరిమిత ఆహారం తీసుకునే నియమాలను పాటించడం మన జీవనశైలిలా భాగం చేసుకోవాలి. అంతర్జాతీయ నిరాహార లేదా ఉపవాస దినం-2024 నినాదంగా "అసబద్ధ ఆహారపు అలవాట్ల కట్టడితో నిన్ను నువ్వు ప్రేమించడం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ఉపవాస దీక్షలతో పలు వ్యాధులు కట్టడి చేయబడి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ వేదిక ఉపయుక్తం అవుతున్నది.

### ప్రతికూల ఆహార అలవాట్లు విషతుల్యం:

విచక్షణారహిత ఆహారపు అలవాట్లు విషతుల్యమని, మనం తీసుకునే ఆహారమే మనకు ఆరోగ్య ప్రదాతలని, కృత్రిమ అందాల వేటలలో అసంబద్ధ ఆహారపు అలవాట్ల చేసుకోవడం లాంటి విషయాలను ప్రజలకు అవగాహన కల్పించాలి. మనం తిన్న ఆహారం మనకు అవసర శక్తిని, చైతన్యాన్ని, పోషకాలను అందించాలి. "మన ఆరోగ్యం మన చేతుల్లోనే, మన ఆరోగ్యం మన కంచంలోనే" అనే నినాదాలను నిత్యం స్మరణ చేసుకోవాలి. 'పరిపూర్ణ ఆరోగ్య సిద్ధికి పరిమిత సమతుల ఆహారం' అనే సూక్తిని సదా గుర్తుంచుకోవాలి. "నిన్ను నువ్వు ప్రేమించడం అంటే ఏం తినాలి, ఎంత తినాలి, ఎప్పుడు తినాలి, ఎప్పుడు మానాలి" అనే విషయాలను అర్థం చేసుకొని ఆచరించడమే. ఆహారపు అలవాట్లు అదుపు తప్పితే స్థూలకాయం, రోగాలకు ఆహ్వానం, సైజ్ పెరిగి ఆత్మన్యూనత లాంటి అనారోగ్యాలు మనల్ని ఆక్రమిస్తాయి. అసంబద్ధ ఆహారపు రుచులకు లొంగితే మన శరీరం అనారోగ్యాల బారిన పడుతుంది.

### నిరాహార లేదా ఉపవాసాల ప్రయోజనాలు:

మన ఇంట్లో పిల్లలకు, యువతకు సరైన ఆహారపు అలవాట్లను అందించడం పెద్దల కనీస బాధ్యత. అసాధారణ, ప్రతికూల శరీర మార్పులకు పునాది మనం నిత్యం తీసుకునే ఆహారమే అని గమనిస్తూ నిరాహార లేదా ఉపవాస క్రమశిక్షణలు పాటిస్తూ మన ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేసుకుందాం. క్రమశిక్షణతో ఉపవాసాలు పాటిస్తే గ్లూకోజ్ నియంత్రణ, ఇన్సులిన్ అదుపు, జీవక్రియ ఆరోగ్యం, గుండె ఆరోగ్యం, బరువు అదుపు, దీర్ఘాయువు, మెదడు ఆరోగ్యం, వాపులు తగ్గడం, హార్మోన్ నియంత్రణ, బిపీ అదుపు, చెడు కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుదల, ఒత్తిడి నియంత్రణ, వృద్ధాప్య నియంత్రణ, క్యాన్సర్ కట్టడి, సానుకూల జీర్ణ క్రియ, థైరాయిడ్ రుగ్మతల కట్టడి, సరళ సుస్థిర జీవన యాత్రలు లాంటి ప్రయోజనాలు కలుగుతాయి.

ఎప్పుడూ తింటేనే కాదు ఉపవాసం ఉంటే కూడా ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలుసుకుందాం, పరిమిత మోతాదులో పోషకాహారం మాత్రమే తీసుకుందాం. క్రమం తప్పకుండా ఉపవాసాలు పాటిస్తూ మన శరీరానికి ఉపశమనం, విశ్రాంతులను బహుకరిద్దాం.



- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేస్తాం.. జేపీ నడ్డా




కరీంనగర్, మే 6:పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లను ఎత్తివేస్తామని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ప్రకటించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో పాల్గొన్న నడ్డా మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో దేశం అధోగతి పాలైందని దుయ్యబట్టారు. పదేళ్ల మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ముస్లిం ఎజెండాతో ముందుకు సాగుతున్నారన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను తిరుగులేని ఐదవ శక్తిగా నిలిపిన ఘనత బీజేపీ నేతృత్వంలోని మోడీ సర్కారుదేనన్నారు. మరోమారు బీజేపీ అధికారంలోకి వస్తే ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం చేసి ప్రపంచంలో భారత్‌ను ఆర్థిక రంగంలో మూడో స్థానంలో నిలుపుతామన్నారు. ప్రజలు అభివృద్ధిని కాంక్షించి, ప్రజా సంక్షేమం కోసం పని చేసే మోడీని ప్రధానిగా మళ్లీ ఎన్నుకునేందుకు బీజేపీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ వెంకటేశ్ నేత, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

# అనంతపురం డిఐజిపై ఎన్నికల సంఘం బదిలీ వేటు

అమరావతి, మే 6: ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పోలీసు ఉన్నతాధికారులపై ఎలక్షన్ కమిషన్ వేటు వేస్తోంది. ఇప్పటికే డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డిపై వేటువేసి అతని స్థానంలో హరీష్ గుప్తాను నియమించింది. తాజాగా రాష్ట్రంలో మరో సీనియర్ పోలీసు అధికారిపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డిపై బదిలీ వేటు వేసింది కేంద్ర ఎన్నికల సంఘం. విధుల నుంచి వెంటనే రిలీవ్ అవ్వాలని ఈసీ ఆదేశించింది. కింది స్థాయి అధికారులకు బాధ్యలు అప్పగించాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహార్ రెడ్డికి ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలయ్యే వరకు ఎన్నికలకు సంబంధించిన విధులేవీ ఆయనకు అప్పగించొద్దని స్పష్టం చేసింది. ఇవాళ రాత్రి 8 గంటల లోపు ముగ్గురు అధికారుల పేర్లతో ప్యానల్ పంపాలని ఆదేశించింది.

డీఐజీ అమ్మిరెడ్డిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల్లో ఆయన ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ విపక్ష కూటమి నేతలు కూడా ఎన్నికల సంఘానికి అనేక ఫిర్యాదులు చేశారు. అధికార పార్టీతో అంటకాగుతున్నారని, ఇందుకు సంబంధించి ఆధారాలు కూడా ఈసీకి చూపించారు కూటమి నేతలు. దీంతో విచారణ జరిపిన ఈసీ.. అమ్మిరెడ్డిని విధుల నుంచి తొలగించింది. పోలింగ్ పూర్తయ్యే వరకు ఆయనకు ఎన్నికల విధులు అప్పగించొద్దని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

## - ప్రసాద్ హైట్స్ అసోసియేషన్ సమ్మేళనంలో రఘురాం రెడ్డి




ఖమ్మం, మే 6(నేటినిజం ప్రతినిధి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదపుటంచున పడిందని కాంగ్రెస్ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. నగరంలోని ప్రసాద్ హైట్స్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ. రాములోరు, అయోధ్య అంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టడం బాధాకరమన్నారు. కేంద్రం గ్యాస్, పెట్రోలు, డీజిల్ ఇతర నిత్యావసర ధరలన్నీ విపరీతంగా పెంచి సామాన్యులను ఇబ్బంది పెడుతోందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. డాక్టర్ కేశవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నూకల నరేష్ రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, అసోసియేషన్ నుంచి కిలారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమలో 52 స్థానాలను గెలుస్తాం- చంద్రబాబు



కర్నూలు, మే 6: ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలోని రాయలసీమలో 52 సీట్లు టీడీపీ పార్టీయే గెలుస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజాగళ యాత్రలో భాగంగా సోమవారం ఆయన కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్లో ఏర్పాటు చేసిన రోడ్ షో ను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. జగన్ ను చూస్తే తాలిబన్, బిల్ లాడెన్ గుర్తు వస్తానన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో అంగులమైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. జగన్ ది క్లాస్ వార్ ఐతే తనది క్యాష్ వార్ గా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. జగన్ పాలనను చూసి విసిగిపోయిన జనం ప్రస్తుత ఎన్నికల్లో జగన్ ను ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో కూడా ఎదురుగాలి ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో ఒక ప్రాజెక్టు పూర్తి చేయలేని అసమర్థులు జగన్ అని పేర్కొన్నారు. మీ భూములను కొట్టేయాలని చూస్తున్నాడు, ప్రజల భూములను లాక్కునే అధికారం జగన్ కి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు.

వైసీపీని భూస్థాపితం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ ది ముమ్మాటికీ మానసిక వైకల్యం అంటూ వ్యంగంగా స్పందించారు. రాష్ట్రంలో నాసిరకం మద్యంతో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇసుక ఉచితంగా ఇస్తే.. ఇప్పుడు దొరక్కుండా చేశారన్నారు. తమ హాయాంలో రూ.500కు ట్రాక్టర్ ఇసుక ఇస్తే.. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.6000కు చేరుకుందన్నారు. ఇసుక ధరలు పెరగడం వల్ల భవన నిర్మాణ కార్మికులు రోడ్డున వడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ దోచుకున్న డబ్బు ప్రజలకు చేరాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రైతులు, ఇతరుల పాస్ పుస్తకాలపై జగన్ ఫోటో ఎందుకని ప్రశ్నించారు. జగన్ ఫోటోతో ఉన్న పాస్ పుస్తకాన్ని చంద్రబాబు అక్కడికక్కడే తగలబెట్టడం విశేషం. ప్రస్తుతం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 2019 లో ఎన్నికల ముందు అమరావతి రాజధాని అన్నారు. అధికారం వచ్చిన తర్వాత మూడు రాజధానులు పేరిట నాటకం ఆడారన్నారు. ఆ తర్వాత ఒక్క రాజధాని కూడా కట్టింది లేదన్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాయలసీమలో 198 ప్రాజెక్టులు పూర్తిగా రద్దు చేశారన్నారు. ఎక్కడాలేని జే బ్రాండ్ల మద్యం తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యం గుల్ల చేశారన్నారు. జగన్ దోచేసిన డబ్బుపై తాను పోరాడుతున్నానన్నారు. జాబు రావాలంటే బాబు రావాల్సిందేనని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ పెడతామన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ అమలు చేస్తామని పేర్కొన్నారు. సైకో జగన్ ను నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో మీ కోపాన్ని, ఆగ్రహాన్ని ఓట్ల రూపంలో చూపించాలన్నారు. ఐదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయకపోగా.. 100కు పైగా ప్రాజెక్టుల పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ సర్వనాశనం చేశారన్నారు. అబద్దాలను చెప్పి ఇంకెన్నాళ్లు ప్రజలను మోసం చేస్తారని అన్నారు.

కోడి కత్తి, గులకరాయి డ్రామాలు ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. మూడు రాజధానులు కాదు ఒక్క రాజధాని అయినా కట్టారా అని చంద్రబాబు జగన్ ను నిలదీశారు. ఎన్నికల సందర్భంగా తిరిగి జనం ముందుకు వచ్చి అబద్దాలు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై మీడియా ప్రశ్నిస్తుంటే వారిపైన కేసులు పెట్టి వేధిస్తున్నారు. మీ భూములను కబ్జా చేసే వారు కావాలా, మీ ఆస్తులు కొట్టేసేవాడు కావాలా ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. మీ జీవితాన్ని మార్చే సూపర్ సిక్స్ పథకాలతో ముందుకు వస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. సూపర్ సిక్స్ తో పాటు మోడీ గ్యారెంటీ పథకాలు ప్రజల ముందు ఉంటున్నాయన్నారు.. ఈనెల 13న పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి తమ ఓటు వేసి వైకాపాను చిత్తుగా ఓడించాలని చంద్రబాబు కోరారు. జగన్ సైకో, అహంకారి, విధ్వంసకుడని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రస్తుత పోస్టల్ బ్యాలెట్లలో టీడీపీకే ఉద్యోగులు మద్దతు పలుకుతున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి తెలుగుదేశంకే ఓటు వేస్తున్నారన్నారు.

కాటసాని భూకబ్జాల రెడ్డి..

పాణ్యం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే కాటేసాని భూకబ్జాల రెడ్డిగా చంద్రబాబు అభివర్ణించారు. నియోజకవర్గంలో మరో కేజీఎఫ్ ఉందన్నారు. కోట్ల రూపాయల విలువచేసే మట్టి, ఎర్రమన్ను తవ్విన ఘనత కాటసానికే దక్కుతుందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి బుద్ధి చెప్పాలన్నారు. కబ్జాల రాయుడి గుండె అదిరిపోవాలన్నారు. గూబ పగిలిపోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కల్లూరులో అక్రమ పట్టాల సృష్టికర్త కాటసానిగా పేర్కొన్నారు. ఇక్కడ వక్ఫ్ బోర్డు ఆస్తులను కూడా వదల లేదన్నారు. 524 సర్వే నెంబర్లు మసీదుకు చెందిన రెండు ఎకరాలు కాటసాని కొట్టివేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. భూమికోసం ముస్లింలను బెదిరించారన్నారు. కబ్జాల రాయుడు పాపాలు పండిపోయినట్లు చెప్పారు. కబ్జారాయుడు కాటసానిని ఓడించడం ఖాయమన్నారు.

# వైసీపీని సాగనంపుదాం- సినీ నటులు నారా రోహిత్, రఘు..

అమరావతి, మే 6:గడచిన ఐదు సంవత్సరాల్లో వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపి, సంక్షేమాన్ని అభివృద్ధిని అందించే కూటమి ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని ప్రముఖ సినీ నటులు నారా రోహిత్, రఘు లు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నందిగామ నియోజకవర్గం లోని చందర్లపాడు లో బిజెపి, జనసేన పార్టీలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్య, కేసినేని వెంకట తో కలిసి వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.సినీ నటులు ఎన్నికల ప్రచారంలో రావడంతో కార్యకర్తలు నాయకుల్లో నూతన ఉత్తేజాన్ని నిలిపింది. ప్రచార రథంపై అభిమానం చేస్తూ ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను అసమర్థపాలనను ఎండగడుతూ, చంద్రబాబు సారథ్యంలోని కోటమ్మ ప్రభుత్వం ఏర్పడితే వచ్చే ప్రయోజనాలను వివరిస్తూ వచ్చారు.

# మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు చేదు అనుభవం



మహబూబ్‌నగర్, మే 6:అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు లోక్ సభ ఎన్నికల ప్రచారంలో చేదు అనుభవం ఎదురైంది. సోమవారం అచ్చంపేట మండలంలోని మన్నె వారి పల్లి గ్రామంలో బీఆర్ఎస్ లోక్ సభ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

గతంలో మన్నె వారి పల్లి గ్రామానికి మెరుగైన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పిస్తానని హామీ ఇచ్చి పది సంవత్సరాల తన పదవి కాలంలో ఎందుకు అమలు చేయలేదని, తప్పుడు హామీలతో మమ్మల్ని మోసం చేశారంటూ గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున నిరసిస్తూ, గువ్వల బాలరాజు గో బ్యాక్ అంటూ ప్రచార కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్నవారిని అక్కడి నుంచి పంపివేశారు.

# మన రాష్ట్రాన్ని మనమే కాపాడుకుందాం..ఎంపీ అభ్యర్థి కేసినేని శివనాథ్



అమరావతి, మే 6:ఒకవైపు ప్రజలకు సంక్షేమం అందించడంతోపాటు అభివృద్ధి చేయడమే ఎన్డీఏ కూటమి ముందున్న లక్ష్యం అని బిజెపి జనసేన పార్టీలు బలపరిచిన విజయవాడ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి కేసినేని శివనాద్(చిన్ని) పేర్కొన్నారు. విజయవాడ పార్లమెంట్ ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు.

వైసిపి అసమర్థ అరాచక, అవినీతి పాలనపై రాష్ట్ర ప్రజలందరూ విసిగిపోయి ఉన్నారన్నారు. వైసిపి అధికార ప్రతినిధి యేలేశ్వరపు జగన్మోహన్ రాజు, నాగేంద్ర లు టిడిపి లో సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలంతా బలంగా నమ్ముతున్నారని చెప్పరు. జగన్ నియంతృత్వ విధానాలు తో అందరూ విసిగి పోయారని, అందుకే వైసిపి లో ఉన్న నాయకులు, కార్యకర్తలు టిడిపి బాట పడుతున్నారని తెలిపారు. ముందు ముందు చాలా మంది ముఖ్య నేతలు టిడిపి లోకి వచ్చేందుకు సిద్ధం గా ఉన్నారని చెప్పారు. కూటమి పార్టీ లు అధికారంలోకి రావడం ఖాయం అన్నారు.అందరం కలిసి మన రాష్ట్రాన్ని మనం కాపాడుకుందాం అని చెప్పారు.

మన పిల్లలు భవిష్యత్తు కోసం యన్డీఏ కూటమి విజయం ఎంతో అవసరం అన్నారు. ఈ ఐదు రోజులూ అందరూ కలిసి మెలిసి పని చేయాలన్నారు. తప్పకుండా దేశంలో మోడి, రాష్ట్రం లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అమరావతి రాజధానిగా అభివృద్ధి చేసి చూపుతాం అని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా యన్డీఏ పాలన సాగుతుందన్నారు. ఈ ఐదు రోజులు ప్రజల్లో ఉంటూ? మనం చేసే మంచిని వివరించాలన్నారు. యేలేశ్వరపు జగన్మోహన్ రావు మాట్లాడుతూ కులాలు, మతాల ప్రాతిపదికన విడగొట్టడమే జగన్ నైజం అన్నారు. నోరు తెరిస్తే అన్నీ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని, బ్రాహ్మణులు అభ్యున్నతికి ఎనిమిది వందల కోట్లు ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు. నిజంగా కేటాయిస్తే ఆ డబ్బు ఎక్కడకి వెళ్లిందో నజ్జల సమాధానం చెప్పాలన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో బ్రాహ్మణులకు అన్యాయం జరిగిందన్నారు. యన్డీఏ కూటమి అధికారంలోకి రావాలి? అప్పుడే అందరకీ మేలు జరుగుతుందన్నారు. బ్రాహ్మణ సంఘాలు మొత్తం కూటమికే మద్దతు ఇస్తున్నాయని తెలిపారు.

# వికసిత్ భారత్ మోదీ కల.. వికసిత్ ఏపీ బాబు, పవన్ కల: లోకేశ్

అమరావతి, మే 6:రాజమహేంద్రవరం: వికసిత్ భారత్ మోదీ కల.. వికసిత్ ఏపీ బాబు, పవన్ కల అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విశ్వజీత్ ( విశ్వాన్ని జయించినవారు) అని నారా లోకేశ్ అన్నారు. భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపుతున్నారని చెప్పారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన కూటమి బహిరంగ సభలో లోకేశ్ ప్రసంగిస్తూ.. దేశానికి మోదీ అవసరం ఎంతో ఉందన్నారు. దేశం దశ.. దిశ మార్చింది 'ఔంటూ' అనే నాలుగు అక్షరాలు అన్నారు. పొత్తు కోసం త్యాగం చేసి పవన్ కల్యాణ్ తొలి అడుగు వేశారు.

226 రోజులపాటు 3వేల కి.మీపైగా పాద యాత్ర చేసి.. ప్రజల కష్టాలను చూశాను. తెదేపా హయాంలో రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించాం. విశాఖను ఐటీ హబ్‌గా చేశాం. యువతకు ఉపాధి ఎలా అందించాలో చంద్రబాబుకు బాగా తెలుసు. జగన్ పాలనలో మొదటి బాధితులు యువతే. కొత్త కంపెనీలు తేకపోగా.. పాత కంపెనీలను వెళ్లగొట్టారు. మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు కూడా ఇవ్వలేకపోయింది" అని లోకేశ్ విమర్శించారు.

# ఇంటింటా ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు



ఖమ్మం, మే 6(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరం 14వ డివిజన్ మధుర నగర్ లో సోమవారం రోజున ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఓబిసి జిల్లా జనరల్ సెక్రెటరీ బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖమ్మం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిని హస్తం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రషీద్, సిపిఐ(ఎం) నాయకులు షేక్ మీరా, కమతం రామకృష్ణ, మూడు ముంతల గంగరాజు, రామ్మూర్తి, షేక్ అబ్దుల్, కాంగ్రెస్ నాయకులు షేక్ రఫీ, రామనాథం, షరీఫ్, మదార్, తోట ప్రసాద్, రామకృష్ణ, బడేసాబ్, తదితరులున్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవర మల్లప్ప



మహబూబ్‌నగర్, మే 6:తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవర మల్లప్ప ఇవాళ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ ఏపీ.జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారు మల్లప్పకు పార్టీ కండువా కప్పి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

లఈ సందర్భంగా దేవరమల్లప్ప మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పాలనలోనే బడుగు వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు గట్టు తిమ్మప్ప, బీ.శివకుమార్, నాయకులు జి.గోపాల్ రెడ్డి, జి.లక్ష్మారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, బోయ రవికుమార్, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది పొడవునా భారతదేశాన్ని సంపూర్ణ గమ్యస్థానంగా ప్రమోట్ చేయడానికి 'కూల్ సమ్మర్స్ ఆఫ్ ఇండియా

న్యూఢిల్లీ, మే 6:మే 6 నుండి మే 9, 2024 వరకు దుబాయ్‌లో జరుగుతున్న అరేబియన్ ట్రావెల్ మార్ట్ 2024లో భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ పాల్గొంటోంది. ఈ ఈవెంట్ మిడిల్ ఈస్ట్ టూరిజం మార్కెట్‌లో భారతదేశం యొక్క ఉనికిని బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన దశను సూచిస్తుంది.

ఇన్‌క్రెడిబుల్ ఇండియా పెవిలియన్‌ను ఈరోజు దుబాయ్‌కి భారత కౌన్సుల్ జనరల్ శ్రీ సతీష్ కుమార్ శివన్ ప్రారంభించారు. యూఏఈ మార్కెట్ మొత్తాన్ని ఆక్రమించుకోవడమే లక్ష్యంగా పెవిలియన్ అద్భుతంగా ఎంట్రీ ఇచ్చింది. టూర్ ఆపరేటర్లు, లగ్జరీ హోటళ్లు, వెల్‌నెస్ రిసార్ట్‌లు మరియు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్‌తో కూడిన ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న భారతదేశం 365 రోజుల గమ్యస్థానంగా తనను తాను ప్రదర్శించుకోవడానికి సిద్ధంగా ఉంది.

అంతగా తెలియని ఇంకా రిఫ్రెష్ గమ్యస్థానాలను హైలైట్ చేస్తూ, పర్యాటక మంత్రిత్వ శాఖ అరేబియా ట్రావెల్ మార్ట్‌లో 'కూల్ సమ్మర్స్ ఆఫ్ ఇండియా' ప్రచారాన్ని ప్రారంభించింది.

ఈ డిజిటల్ ప్రచారం హిమాలయాలతో సహా హిల్ రిసార్ట్‌లలో దాని ఆఫర్‌లను నొక్కి చెబుతూ, వేసవి ప్రయాణానికి భారతదేశం చాలా వేడిగా ఉందనే భావనను సవాలు చేస్తుంది. ఈ ప్రచారం ఏడాది పొడవునా భారతదేశాన్ని సంపూర్ణ గమ్యస్థానంగా ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తుంది.

అరేబియన్ ట్రావెల్ మార్ట్ 2024లో భారతదేశం పాల్గొనడం పర్యాటక పరిశ్రమ మరియు ఆర్థిక వ్యవస్థకు అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ ఈవెంట్ భారతీయ పర్యాటక క్రీడాకారులకు వారి సమర్పణలను ప్రదర్శించడానికి, పరిశ్రమలో పొత్తులను ఏర్పరచుకోవడానికి మరియు ఓఇఎం ప్రాంతం నుండి సందర్శకులను ఆకర్షించడానికి ఒక వేదికను అందిస్తుంది. ఇది, ఆదాయాన్ని పెంచుతుందని మరియు పర్యాటక రంగంలో ఉద్యోగాల కల్పనను పెంపొందిస్తుందని భావిస్తున్నారు.

# ఇవిఎం యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి: రిటర్నింగ్ అధికారి



ఖమ్మం, మే 6(నేటినిజం ప్రతినిధి): ఇవిఎం యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. సోమవారం రిటర్నింగ్ అధికారి, సత్తుపల్లి జ్యోతి నిలయం హైస్కూల్ లో చేపడుతున్న సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ ఈవియం యంత్రాల, వివిపాట్ల కమిషనింగ్ ప్రక్రియను, మాక్ పోల్ ను పరిశీలించారు. సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ కు చెందిన 294 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్ లు, కంట్రోల్ యూనిట్ లు, వివిప్యాట్ ల కమిషనింగ్ చేపడున్నట్లు ఆయన తెలిపారు. బ్యాలెట్ యూనిట్ల పొందికలో జాగ్రత్తలు వహించాలని, సంబంధిత సీలింగులు చేయాలని ఆయన అన్నారు. అనంతరం సత్తుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం, మండల సమాఖ్య ఉపాధిహామీ భవనం లలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి నిర్వహిస్తున్న రిజిస్టర్లు పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ చేపడుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు ఎంతమంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించింది అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను రిటర్నింగ్ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్, ఏసీపీ ఏ.రఘు, కల్లూరు ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, సత్తుపల్లి మండల తహసీల్దార్ యోగేశ్వర రావు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# నీటి సంపులో పడి.. బాలుడు మృతి

నిజామాబాద్, మే 6:నీటి సంపులో పడి బాలుడు మృతిచెందిన ఘటన తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి బాలుడు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతిచెందాడు.

సానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేవరాజు కొడుకు అన్విత్ (3) ఇవాళ ఉదయం ఇంటి ముందు బాల్ తో ఆడుకుంటుండగా బాల్ నీటి సంపులో పడడంతో బంతి కోసం సంపులోకి వంగిన చిన్నారి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వెంటనే చిన్నారిని కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టంనకు తరలించినట్లు పేర్కొన్నారు.

# రేవంత్ లక్కీ డిప్ ముఖ్యమంత్రి - డి కె అరుణ

హైదరాబాద్, మే 6:లక్కీ డిప్ లో రేవంత్ రెడ్డికి సీఎం పదవి తగిలిందని మహబూబ్ నగర్ అభ్యర్థి డీకే అరుణ మండిపడ్డారు. లక్కీ డిప్ లో రేవంత్ రెడ్డికి సీఎం పదవి తగిలిందన్నారు. అధికారం, అహంకారంతో విర్రవిగితే కేసిఆర్ కుటుంబానికి చెప్పినట్లుగా మీకు కూడా ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. మహబూబ్ నగర్ లో ఆమె నేడు మీడియాతో మాట్లాడుతూ, బూతు మాటలు మాట్లాడే ముఖ్యమంత్రి ఉన్నడంటే సిగ్గు అవుతోందన్నారు. దశాబ్దాల పాటు జిల్లా అభివృద్ధి కోసం పనిచేసిన కుటుంబం మాదని తెలిపారు. మోదీని తిట్టడం అంటే ఆకాశం మీద ఉమ్మేసినట్టే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మెగా డిఎస్సీ ఎక్కడ....

జీవో 46 తో పాలమూరు జిల్లా యువత ఉద్యోగాలు నష్టపోతున్నారన్నారు. తక్షణమే జీవో 46 రద్దు చేసి గ్రామీణ ప్రాంత యువతకు న్యాయం చేయాలన్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేసి ఖాళీలు పూర్తిగా భర్తీ చేస్తాం అన్నారు. 40వేల టీచర్ పోస్టుల భర్తీ ఏమైంది? అని ప్రశ్నించారు. ఆఫ్ లైన్ లో పరీక్ష నిర్వహిస్తామని చెప్పి మళ్ళీ ఆన్లైన్ లో నిర్వహిస్తున్నారని తెలిపారు. పరీక్ష ఫీజు పెంచి ఉద్యోగార్థులపై భారం వేస్తున్నారని తెలిపారు. ఏం చేస్తామో చెప్పకుండా వ్యక్తిగతంగా మహిళా అని చూడకుండా తనను ధూషిస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను అవమానిస్తుంటే తమరి విలువ పెరగకపోగా మరింత దిగజారు తోందని రేవంత్ కు హితకు పలికారు.. అరుణమ్మ కల్తీ రక్తం అని ఇష్టం వచ్చినట్లు రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

# భారత సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రత్యక్ష పరిశీలనకు అతిపెద్ద ప్రపంచ ప్రతినిధి బృందం

న్యూఢిల్లీ, మే 6:ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అత్యున్నత ప్రమాణాల పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించడంతోపాటు పారదర్శక సంస్కృతిని పెంపొందించే సంప్రదాయాన్ని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) నిరంతరం చాటుకుంటోంది. తదనుగుణంగా ఈసారి 'అంతర్జాతీయ ఎన్నికల సందర్శకుల కార్యక్రమం' (ఐవిఇపి) కింద ప్రపంచంలోని 23 దేశాల నుంచి 75 మంది ప్రతినిధులు భారత సార్వత్రిక ఎన్నికల ప్రత్యక్ష పరిశీలనకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఇవాళ న్యూఢిల్లీలో ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సిఇసి) శ్రీ రాజీవ్ కుమార్, కమిషనర్లు శ్రీ జ్ఞానేష్ కుమార్, శ్రీ సుఖ్‌బీర్ సింగ్ సంధుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా సీఈసీ శ్రీ రాజీవ్ కుమార్ ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. భారత ఎన్నికల పరిమాణం, ఎన్నికల సంఘం కృషి ప్రపంచ విస్తృత ప్రజాస్వామ్య ప్రక్రియలో గణనీయ పాత్ర పోషిస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియ, తద్వారా ఉద్భవించే సామర్థ్యం పరంగా చూస్తే దీన్ని 'ప్రజాస్వామ్య విస్తృతి'గా వ్యవహరించవచ్చునని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య ప్రాధాన్యం తగ్గుదల లేదా క్షీణతపై ఆందోళన పెచ్చుమీరుతున్న నేపథ్యంలో భారత సార్వత్రిక ఎన్నికలకు గణనీయ ప్రాముఖ్యం ఉందన్నారు. అలాగే భారతీయ ఎన్నికల ప్రక్రియ ఎంతో విశిష్టమైనదని ఆయన గుర్తుచేశారు. ఎన్నికల జాబితాలో నమోదు లేదా ఓటు వేయడం అన్నది ఇక్కడ తప్పనిసరి కాదని శ్రీ కుమార్ పేర్కొన్నారు. అందువల్ల పౌరులు స్వచ్ఛందంగా ఈ ప్రక్రియలో పాల్గొనేలా ఒప్పించాల్సిన వాతావరణంలో 'ఇసిఐ' పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ మేరకు ఎన్నికల జాబితాలో పేరు నమోదుసహా ఓటు హక్కు వినియోగించుకునేలా క్రమబద్ధ అవగాహన కార్యక్రమాల ద్వారా వారికి ప్రేరణనిస్తామని వివరించారు. ఒక్క వాక్యంలో చెబితే- "జనాభా-ఓటర్ల నిష్పత్తి పరంగా ఓటర్ల జాబితాలలో దాదాపు పూర్తి సంతృప్తత, ఎన్నికలలో అత్యధికంగా నమోదయ్యే ఓటింగ్ శాతం వంటివి మేం చేపట్టే ప్రక్రియల విశ్వసనీయతను ప్రస్ఫుటం చేస్తాయనడం అత్యంత సముచితం" అని ఆయన విశదీకరించారు.



భారతదేశంలో ఎన్నికల నిర్వహణ కసరత్తు గురించి వివరిస్తూ- దేశవ్యాప్తంగా 10 లక్షలకుపైగా పోలింగ్ కేంద్రాలు ఉండగా, 15 లక్షల మందికిపైగా సిబ్బంది 97 కోట్లమేర భారీ సంఖ్యలోగల ఓటర్లను స్వాగతిస్తారని చెప్పారు. ఇక పోలింగ్ కేంద్రాల సందర్శన సందర్భంగా దేశంలోని ఓటర్లలో వైవిధ్యాన్ని ప్రతినిధులు పూర్తిస్థాయిలో ప్రత్యక్షంగా చూడవచ్చునని శ్రీ కుమార్ తెలిపారు. భారతదేశం అనేక పండుగలకు నిలయమని, అందులో భాగమైన ప్రస్తుత ప్రజాస్వామ్య మహోత్సవ అనుభవాన్ని ప్రత్యక్షంగా చవిచూడాలని ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా కజకిస్తాన్, ఉజ్బెకిస్థాన్, నేపాల్ దేశాల ప్రధాన ఎన్నికల కమిషనర్లు, ప్రతినిధి బృందాలతో 'ఇసిఐ' ద్వైపాక్షిక చర్చలు నిర్వహించింది.

అంతకుముందు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఇవి ఎం)-వీవీ ప్యాట్, ఐటీ కార్యక్రమాలు, ప్రచురణ-ప్రసార, సామాజిక మాధ్యమాల పాత్ర సహా భారత సార్వత్రిక ఎన్నికలు-2024 సంబంధిత వివిధ అంశాలపై ప్రతినిధులకు సమగ్రంగా వివరించబడింది. ఈ మేరకు సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ శ్రీ ధర్మేంద్ర శర్మ ఆధ్వర్యాన అధికారులు ఎన్నికల ప్రక్రియపై స్థూలంగా వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ ఎన్నికల కమిషనర్ శ్రీ ఆర్.కె.గుప్తా పర్యవేక్షించారు. అనంతరం 'ఇవిఎం-వీవీప్యాట్' గురించి మరో సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ శ్రీ నితీష్ కుమార్ ప్రదర్శనాత్మకంగా విశదీకరించారు. అలాగే సమాచార సాంకేతికతల పరంగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలు, కార్యక్రమాల గురించి ఆ విభాగం డైరెక్టర్ జనరల్ శ్రీమతి నీతా వర్మ వివరించగా, ప్రచురణ-ప్రసార, సామాజిక మాధ్యమాల పరంగా చేపట్టిన చర్యలను సంయుక్త డైరెక్టర్ (మీడియా) అనుజ్ చందక్ తెలియజేశారు.

ఈ కార్యక్రమాలకు హాజరైన ప్రపంచ దేశాల ప్రతినిధులు బృందాలుగా విడిపోయి మహారాష్ట్ర, గోవా, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు వెళతారు. ఆయా రాష్ట్రాల్లోని వివిధ నియోజకవర్గాల్లో ఎన్నికల సన్నాహాలు, నిర్వహణ ప్రక్రియను వారు ప్రత్యక్షంగా పరిశీలిస్తారు. ఈ సందర్శన కార్యక్రమం 2024 మే 9న ముగుస్తుంది. భారత ఎన్నికల వ్యవస్థలోని సూక్ష్మాంశాలు సహా ఉత్తమ నిర్వహణాత్మక పద్ధతులను విదేశీ ఎన్నికల సంఘాల ప్రతినిధులకు ఈ కార్యక్రమం పరిచయం చేస్తుంది.

సార్వత్రిక ఎన్నికలు-2024 స్థాయి, పరిమాణాలకు తగినట్లుగా ఈసారి ప్రపంచంలోని మొత్తం 23 దేశాల ఎన్నికల నిర్వహణ సంస్థల, సంఘాలకు చెందిన అతిపెద్ద ప్రపంచ ప్రతినిధుల బృందం భారత్ సందర్శిస్తోంది. ఈ మేరకు భూటాన్, మంగోలియా, ఆస్ట్రేలియా, మడగాస్కర్, ఫిజీ, కిర్గిజ్ రిపబ్లిక్, రష్యా, మోల్డోవా, ట్యునీషియా, సీషెల్స్, కంబోడియా, నేపాల్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, జింబాబ్వే, బంగ్లాదేశ్, కజకిస్తాన్, జార్జియా, చిలీ, ఉజ్బెకిస్తాన్, మాల్దీవ్స్, పపువా న్యూగినీ, నమీబియా దేశాల ప్రతినిధులు వచ్చారు. వారితోపాటు 'ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎలక్టోరల్ సిస్టమ్స్' (ఐఎఫ్ఇఎస్), సభ్యులుసహా భూటాన్, ఇజ్రాయెల్ దేశాల మీడియా బృందాలు కూడా పాల్గొంటున్నాయి.

# ఆ ముగ్గురూ మోసగాళ్లే - వాళ్లతోనే మీ బిడ్డ పోరాటం - జగన్



అమరావతి, మే 6: మనం ముగ్గురం మోసగాళ్లతో పోరాడుతున్నాం.. మళ్లీ చంద్రబాబు సూపర్ సిక్స్ అంటున్నాడు. సూపర్ సెవెన్ అంటాడు.. ఇంటింటికీ కేజీ బంగారం ఇస్తారంట.. ఇంటింటికీ బెంజికారు కొనిస్తారట, నమ్ముతారా..ఒక్కసారి ఆలోచన చేయాలని సీఎం జగన్ ప్రశ్నించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో సోమవారం ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ.. 2014లో ఇదే పెద్ద మనిషి చంద్రబాబు ఇదే ముగ్గురితో కలిసి కూటమిగా ఏర్పడి ఈ పాంప్లెట్ మీద స్వయంగా సంతకం పెట్టి. ప్రధాన హామీల పేరుతో సంతకం పెట్టిన ఈ పాంప్లెట్టును ప్రతి ఇంటికి పంపించాడు. మరి ఆయన ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఇందులో చెప్పినవి ఒక్కటంటే ఒక్కటైనా జరిగిందా అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీపై మొదటి సంతకం చేస్తానన్నాడు. మరి రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ జరిగిందా?పొదుపు సంఘాల రుణాలన్నీ రద్దు చేస్తానన్నాడు. అక్కాచెల్లెమ్మల పొదుపు సంఘాల రుణాలన్నీ రద్దు చేస్తానన్నాడు. ఏకంగా రూ.14,205 కోట్లు పొదుపు సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానన్నాడు. ఇందులో ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా.. అని ప్రశ్నించారు.

మాట్లాడేవన్నీ అబద్ధాలే..

ఆడ బిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు మీ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నాడు.రూ.25 వేల కథ దేవుడెరుగు ఒక్కరి ఖాతాలో అయినా కనీసం ఒక్క రూపాయి అయినా డిపాజిట్ వేశాడా.. అని ప్రశ్నించారు. ఇంటింటికీ ఉద్యోగం. ఉద్యోగం ఇవ్వకపోతే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ప్రతి నెలా అన్నాడు. ఐదేళ్లు అంటే 60 నెలలు, నెలకు రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికీ రూ.1,20,000 ఇచ్చాడా.. అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు అన్నారు. ఇన్ని వేల మంది ఇక్కడున్నారు కదా. చంద్రబాబు హయాంలో చంద్రబాబు మీలో ఏ ఒక్కరికైనా కూడా ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా? అని సీఎం జగన్ ప్రశ్నించారు. రూ.10,000 కోట్లతో బీసీ సబ్ప్లేన్, చేనేత పవర్ లూమ్స్ రుణాల మాఫీ అన్నాడు.. అయ్యిందా? విమెన్ ప్రొటెక్షన్ ఫోర్సు ఏర్పాటు చేస్తామన్నాడు.. చేశాడా?. సింగపూరుకు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. చేశాడా? ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు జరిగిందా.. మన రేపల్లెలో ఏమైనా కనిపిస్తోందా.. మరి ఆలోచన చేయమని అడుగుతున్నా కనీసం ఒక్కదించే ఒక్కటైనా అయిందా.. అని మీ బిడ్డ అడుగుతున్నాడు. నేను అడుగుతున్నా పోనీ ప్రత్యేక హోదా అయినా ఇచ్చాడా.. దాన్నీ అమ్మేశాడు. మరి నేను అడుగుతున్నా. ఇలాంటి వాళ్లను నమ్మొచ్చా..అని సీఎం జగన్ ప్రశ్నించారు.

# విజ్ఞానం మరియు విద్యకు కేంద్రంగా భారతదేశం యొక్క చారిత్రక వైభవాన్ని ఉపరాష్ట్రపతి హైలైట్

న్యూఢిల్లీ, మే 6:వైస్ ప్రెసిడెంట్, శ్రీ జగదీప్ ధంఖర్ ఈ రోజు భారతదేశం యొక్క చారిత్రక వైభవాన్ని విజ్ఞానం మరియు విద్య యొక్క కేంద్రంగా నొక్కిచెప్పారు మరియు దేశం తన గత వైభవాన్ని తిరిగి పొందేందుకు దృఢంగా పయనిస్తున్నదని నొక్కి చెప్పారు. నలంద మరియు తక్షశిల వంటి సంస్థల యొక్క విశిష్టమైన వారసత్వాన్ని ప్రస్తావిస్తూ, ఉపరాష్ట్రపతి సమకాలీన కాలంలో భారతదేశ విద్యా రంగం యొక్క నమూనా మార్పు డ పునరుజ్జీవనాన్ని హైలైట్ చేశారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఓపెన్ లెర్నింగ్ (SOL) యొక్క 62వ స్థాపన దినోత్సవ వేడుకలను ఉద్దేశించి ప్రసంగించిన వైస్ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రొఫెషనల్స్, హోమ్‌మేకర్స్ మరియు వివిధ రంగాల నుండి విభిన్న శ్రేణి అభ్యాసకుల కోసంSOL ఒక పరివర్తన వేదికను అందించినందుకు ప్రశంసించారు. విద్యార్థులు.

SOL గతంలో పరిస్థితుల కారణంగా వికలాంగులకు తలుపులు తెరిచిందని, వారి దినచర్యకు అంతరాయం కలగకుండా విద్యను కొనసాగించేందుకు వీలు కల్పిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. అంతకుముందు అధికారిక విద్యను కోల్పోయిన వారికి రెండవ అవకాశాన్ని అందించినందుకు, విజ్ఞానం మరియు నైపుణ్యాల ద్వారా అట్టడుగు వర్గాలకు సాధికారత కల్పించి, తద్వారా నిజమైన సంఘటిత వాతావరణాన్ని పెంపొందించినందుకు SOLని శ్రీ ధంఖర్ ప్రశంసించారు. విద్యా సంస్థల సారాంశం మరియు నాణ్యతను రూపొందించడంలో మౌలిక సదుపాయాలపై అధ్యాపకుల కీలక పాత్రను శ్రీ ధంఖర్ మరింత నొక్కి చెప్పారు.

మార్పు కోసం విద్యను అత్యంత ప్రభావవంతమైన పరివర్తన యంత్రాంగాన్ని హైలైట్ చేస్తూ, విద్య అనేది కేవలం జ్ఞానాన్ని పొందే సాధనం కాదని శ్రీ ధంఖర్ నొక్కి చెప్పారు; బదులుగా, ఇది పురోగతి, సాధికారత మరియు సామాజిక పరివర్తనకు మూలస్తంభం. ఇది పురోగతి, శ్రేయస్సు మరియు సాధికారతకు తలుపును అన్‌లాక్ చేసే కీ. "విద్య అనేది గొప్ప హక్కు మరియు దానం.

విద్య కంటే గొప్ప ప్రాథమిక హక్కు లేదు మరియు విద్య కంటే విరాళం గొప్పది కాదు" అన్నారాయన.

చంద్రయాన్ ప్రయాణం నుండి ప్రేరణ పొందింది, అక్కడ ప్రారంభ వైఫల్యం తర్వాత అది చంద్రుని యొక్క దక్షిణ ధ్రువంపై సాఫీగా ల్యాండింగ్ చేసింది, శ్రీ ధంఖర్ వైఫల్యాన్ని విజయానికి కీలకంగా పరిగణించాలని విద్యార్థులను కోరారు. ఆధునిక ప్రపంచంలోని సంక్లిష్టతలను నావిగేట్ చేయడంలో స్థితిస్థాపకమైన మనస్తత్వం యొక్క అవసరాన్ని అతను నొక్కి చెప్పాడు.

ఇండియన్ ఎడ్యుకేషనల్ ల్యాండ్‌స్కేప్‌లో ది న్యూ ఎడ్యుకేషన్ పాలసీ యొక్క కీలక పాత్రను హైలైట్ చేస్తూ,




ఎన్ఇపి ఒక పరివర్తనాత్మక మార్పును తెలియజేస్తుందని, సంపూర్ణ అభ్యాసకుల అభివృద్ధికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించిందని మరియు 21వ శతాబ్దపు సవాళ్లకు సన్నద్ధమైన జ్ఞానవంతమైన సమాజాన్ని సృష్టించాలని శ్రీ ధంఖర్ పేర్కొన్నారు. అతను సౌకర్యవంతమైన అభ్యాస మార్గాలు, సాంకేతికత ఏకీకరణ, విభిన్న అవసరాలు మరియు ఆకాంక్షలను గుర్తించడంపై ఎన్ఇపి యొక్క ప్రాధాన్యతను నొక్కి చెప్పాడు.

ఎన్ఇపి ఊహించినట్లుగా, నాణ్యమైన విద్యకు ప్రాప్యతను విస్తరించడంలో మరియు దీర్ఘకాలిక అంతరాలను పూడ్చడంలో స్కూల్ ఆఫ్ ఓపెన్ లెర్నింగ్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి కారు ను ఢీకొన్న బైక్ - ఇద్దరు యువకులు మృతి..

మహబూబ్‌నగర్, మే 6:కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తలకొండపల్లి మండలం వెల్జాల్‌లో ఎన్నికల ప్రచారం ముగించుకొని వెళ్తుండగా.. గ్రామ శివారులో ఎమ్మెల్యే కారును ఓ బైకు ఢీ కొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

ఈ ప్రమాదంలో నరేశ్ (25) అక్కడికక్కడే మృతి చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరశురామ్ ప్రాణాలు కోల్పోయాడు. మృతులను వెంకటాపుర్‌కు చెందిన వారిగా గుర్తించారు.

ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి కారు ధ్వంసమైంది. ఎయిర్ బెలూన్‌లు సకాలంలో తెరుచుకోవడంతో ఎమ్మెల్యే స్వల్ప గాయాలతో బయటపడ్డారు చికిత్స కోసం ఆయనను హాస్పటల్ కు తరలించారు? కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జార్ఖండ్ మంత్రి కార్యదర్శి నౌకరు గదిలో లెక్కల్లో చూపని నోట్ల కట్టలు

న్యూఢిల్లీ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జార్ఖండ్ మంత్రి కార్యదర్శికి చెందిన నౌకరు గదిలో లెక్కల్లో చూపని కరెన్సీ నోట్ల గుట్టను ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. నౌకరు గదిలో నుంచి పెద్ద పెద్ద సంచుల్లో నోట్ల కట్టలను ఇడి అధికారులు బయటకు తీసుకువస్తున్న వీడియోలు, ఫోటోలు వర్గాలు షేర్ చేశాయి. అందులో కేంద్ర భద్రతా సిబ్బందిని కూడా చూడవచ్చు. జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలంగిర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్ వద్ద పనిచేసే నౌకరు చెందిన గదిగా అధికార వర్గాలు తెలిపాయి. స్వాధీనం చేసుకున్న నోట్ల కట్టల విలువ కచ్చితంగా ఎంత ఉందన్న విషయం అధికారికంగా తెలియరానప్పటికీ రూ. 20 కోట నుంచి రూ. 30 కోట్లు ఉండవచ్చని వర్గాలు తెలిపాయి. డబ్బంతా చాలా వరకు రూ. 500 నోట్ల రూపంలో ఉందని, కొంత మొత్తంలో బంగారు నగలు కూడా స్వాధీనం చేసుకున్నారని వారు చెప్పారు. కాంగ్రెస్ నాయకుడైన ఆలం(70) పాకూర్ స్థానం నుంచి జార్ఖండ్ అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ చీఫ్ ఇంజనీర్ వీరేంద్ర కుమార్ రామ్‌పై నమోదైన మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఈ సోదాలు జరిగాయి. మాజీ చీఫ్ ఇంజనీర్ రామ్ గత ఏడాది అరెస్టు అయ్యారు. రాంచిలోని గ్రామీణ పనుల శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన రామ్ కాంట్రాక్టులు కేటాయించినందుకు ప్రతిఫలంగా కాంట్రాక్టర్ల నుంచి కమిషన్ల రూపంలో భారీ ఎత్తున వసూలు చేశారు. ఆయనకు చెందిన రూ. 39 కోట్ల ఆస్తులను జప్తు చేసుకున్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లో ఇడి ఒక ప్రకటనలో తెలిపింది. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో రామ్, ఆయన కుటుంబ సభ్యులు విలాసవంతమైన జీవితం గడిపారని ఇడి తెలిపింది. జార్ఖండ్ ఎసిబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామ్‌పై ఇడి దాడి చేసింది.

# క్షతగాత్రుని వైద్యానికి వెన్సో ఆర్థిక సహాయం

హైదరాబాద్, మే 6 (జనవాణి న్యూస్); వడ్రంగి వృత్తిలో ఉన్నబొల్లోజు జనార్ధన్ చారి(50) కొద్ది రోజుల క్రింద పని పూర్తి చేసుకొని హయత్ నగర్ లో తన ఇంటికి తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఛాతీకి, మొఖం మీద అనేక తీవ్రమైన గాయాలు అయ్యాయి. అపస్మారక స్థితిలో దగ్గరలోనే ఉన్న ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చేర్చబడి, అక్కడేచికిత్స పొందుతున్నారు. అతని భార్య, కూతురు, ఇద్దరు కుమారుల భవిష్యత్తుఅతనిపై ఆధార పడి ఉంది! ఇప్పటి వరకు అతని చికిత్సకు 3.5 లక్షల రూపాయల ఖర్చు అయింది. మిగిలిన చికిత్సకు ఇంకా 1.50 లక్షల రూపాయల ఖర్చు అవుతుందని, ఆయన సోదరుడు, స్థానిక నాయకుడు వెలుకుర్తి చంద్రశేఖర్ ద్వారా సహాయం కోసం వెన్సోని ఆశ్రయించారు. వెన్సో గౌరవ దాతల సహకారంతో జనార్ధన చారికి రూ. 52,700/- అందచేసింది. ఈ సందర్భంగా వెన్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ వైద్య ఖర్చులు భరించలేక, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న జనార్ధన్ చారికి సమయానికి సహాయం చేసి ఆదుకొన్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# పాఠశాలలో ఉపాధ్యాయులు చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు

## –తాను చిన్నప్పుడు పాఠశాలలో బెత్తం దెబ్బలు తిన్నాను
## –ఆ రోజును ఎప్పటికీ మరచిపోలేను
## – భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్

కాఠ్‌మాండూ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రస్తుతం పాఠశాలలో చిన్నారులపై ఉపాధ్యాయులు చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. కానీ కొన్నేళ్ల క్రితం విద్యనభ్యసించిన వారికి మాత్రం ఇది సాధారణం. ఈ తరహా శిక్ష భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ కు కూడా ఎదురైంది. తాను చిన్నప్పుడు పాఠశాలలో బెత్తం దెబ్బలు తిన్నానని, ఆ రోజును ఎప్పటికీ మరచిపోలేనని స్వయంగా ఆయనే వెల్లడించారు. జువెనైల్ జస్టిస్ ( బాలల నేర న్యాయవ్యవస్థ ) అంశంపై నేపాల్‌లో జరుగుతున్న సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. పిల్లలతో ఉపాధ్యాయుల ప్రవర్తనా విధానం వారి మనసుపై లోతైన ప్రభావం చూపుతుందని, అది వారికి జీవితాంతం గుర్తుండిపోతుందని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. " నేను 5 వ తరగతి చదువుతున్న రోజుల్లో జరిగిన సంఘటనను ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో క్రాఫ్ట్ నేర్చుకుంటున్నా. అసైన్‌మెంట్ కోసం అవసరమైన సరైన సైజు గల సూదులను తీసుకురాలేదు. ఈ విషయం తెలుసుకుని మా టీచర్ నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెత్తంతో నా చేతిపై బలంగా కొట్టారు. చేతిపై కొట్టకుండా మరెక్కడైనా కొట్టమని ఎంతో వేడుకున్నా. దెబ్బలకు నా కుడి చేయి కందిపోయింది. అవమానంతో 10 రోజుల వరకు చేతిని ఎవరికీ చూపించుకోలేదు" అని పంచుకున్నారు. " కొంతకాలం తరువాత భౌతిక గాయం నయమైంది. కానీ ఆ సంఘటన నాపై ఎంతో ప్రభావం చూపించింది. ఇప్పటికీ ఏదైనా పనిచేస్తున్నప్పుడు గుర్తుకు వస్తుంది" అని అన్నారు. చట్టపరమైన సంఘర్షణల్లో చిక్కుకున్న బాలల బలహీనతలు, ప్రత్యేక అవసరాలను గుర్తించాలన్నారు. ముఠాల ద్వారా చిన్నారులు నేర కార్యకలాపాల్లోకి బలవంతంగా వెళున్న విషయాన్ని పరిగణన లోకి తీసుకోవాలన్నారు. దృష్టి లోపం ఉన్న పిల్లలతో వ్యవస్థీకృత నేర బృందాలు ఎలా భిక్షాటన చేయిస్తున్నాయో చూస్తూనే ఉన్నామని, యుక్తవయసు పిల్లలు, దివ్యాంగులకు కూడా ఈ ముప్పు ఉందన్నారు.

# మానసిక సమస్యలు పరిష్కారం కొరకు అవసరమైన కౌన్సిలింగ్ చేయించాలి

## – ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బండారి జగదీష్




హనుమకొండ మే 6 (దక్షిణాది న్యూ స్);బాల సంస్కార్ వేసవి 10 రోజుల శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం రోజున తల్లిదండ్రులకు పిల్లల పెంపకంపై వరంగల్ పట్టణంలోని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బండారి జగదీష్ చే ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. పిల్లలు టీనేజ్ లోకి వచ్చే క్రమంలో వారిలో మానసికంగా, శారీరకంగా వచ్చే మార్పులను తల్లిదండ్రులు గుర్తించి వారి అభిప్రాయాలను వినాలని వారి వ్యక్తిత్వాన్ని గౌరవించాలని చెప్పారు. శారీరక బాధలలాగానే మానసిక సమస్యలు సైతం సర్వ సాధారణమని, సత్వర పరిష్కారం కొరకు సైకియాట్రిక్ కేర్, అవసరమైన కౌన్సిలింగ్ చేయించాలని తెలిపారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సమాధానం ఇచ్చారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ముఖ్యంగా భవిష్యత్తరాలను నైతికవిలువలతో ఎదిగేలా మరియు మన సంస్కృతీసంప్రదాయాలను గౌరవించేలా తీర్చి దిద్దే ప్రాంగణంగా భాసిల్లుతుందన్నారు. భగవాన్ శ్రీ రామకృష్ణ ధ్యాన మందిరానికి ప్రజల సహాయ సహకారాలు అందించాలని కోరారు. శిక్షణ శిబిరానికి హాజరైన పిల్లలచే తల్లిదండ్రులకు "పాదపూజ" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. పిల్లలకు ప్రత్యక్ష దైవాలు తల్లిదండ్రులు వారిని గౌరవించడం, వారి పట్ల అభిమానాన్ని ఆప్యాయతను కనపరచడం పిల్లల నైతిక బాధ్యత. అదేవిధంగా పిల్లలను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం తల్లిదండ్రుల ధర్మం. ఈ రెండింటి మేలవింపు కార్యక్రమమే పాదపూజ. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలుఒతల్లిదండ్రులు భావోద్వేగానికి గురి కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవాసమితి హనుమకొండ ప్రధాన కార్యదర్శి జినుగు విష్ణువర్ధన్ రెడ్డి, కోశాధికారి కే వీ రావు, బాలసంస్కర్ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ రామకృష్ణ, స్వరూప, రాధిక, సేవా సమితి సభ్యులు తిరుపతిరెడ్డి, కేదారి,అశోక్ రెడ్డి, అంజనీ దేవి, లక్ష్మీదేవి,పార్వతి, సరోజ,అనిత, శిల్ప మరియు వాలంటీర్లు వీణ, విష్ణు, పరశురాములు, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం! రాహుల్ని ప్రధానిని చేద్దాం!

## –అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మేరుగు బాబు యాదవ్

హన్మకొండ మే 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం! రాహుల్ని ప్రధానిని చేద్దాం! అని అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ,తెలంగణ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ బి.సి. సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మేరుగు బాబు యాదవ్ పిలుపునిచ్చారు. ప్రస్తుతము దేశ ఔన్నత్యాన్ని నిలిపేందుకై జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలలో మన తెలంగాణ రాష్ట్రం పక్షాన కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులైన వరంగల్ మరియు మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజక వర్గాల నుండి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డా॥ కడియం కావ్య మరియు పోరిక బలరాం నాయక్ గార్లను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు చేతిగుర్తుపై ఓటువేసి మన బి.సి. వర్గాల ప్రజలందరూ, ముఖ్యంగా యాదవులందరూ ఐక్యతను చాటుకొనాలని అఖిల భారతీయ యాదవ మహాసభ పక్షాన ముకుళిత హస్తాలతో సవినయంగా విజ్ఞప్తి చేసారు.

తెలంగాణ మూడున్నర కోట్ల ప్రజల ఆత్మగౌరవ, దశాబ్దాల ఆకాంక్ష అయిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాన్ని గొప్ప మనస్సుతో అవగాహన చేసుకొని ఎన్ని ఒడిదొడుకులు, అడ్డంకులు, అవాంతరాలు, కష్టనష్టాలు ఎదురైనప్పటికీ సాహసోపేత నిర్ణయం తీసుకొని సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించింది. దానికి కృతజ్ఞతగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పరచినందుకు తెలంగాణ ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి:రిటర్నింగ్ అధికారి



ఖమ్మం, మే 6(నేటినిజం ప్రతినిధి): ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. సోమవారం రిటర్నింగ్ అధికారి, సత్తుపల్లి మండలం బి.గంగారం గ్రామంలో మేడిశెట్టివారిపాలెం క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటుచేసిన అంతరాష్ట్ర చెక్ పోస్ట్ తనిఖీ చేశారు. వాహన తనిఖీ రిజిష్టరు పరిశీలించారు. ఏ రకాల వాహానాలు తనిఖీ చేస్తున్నది, ఇంతవరకు చెక్ పోస్ట్ తనిఖీల్లో పట్టుకున్న నగదు, మద్యం, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వాహనాలు, రాజకీయ పార్టీల వాహనాలు తదితర అన్ని రకాల వాహనాల తనిఖీలు చేయాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సీజర్లపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ అధికారులు తదితరులు ఉన్నారు.

# కేసీఆర్‌ను అవమానిస్తే.. మెదక్‌ను అవమానించినట్లే : హరీశ్‌రావు



మెదక్, మే 6: మెదక్‌ను అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి నానా మాటలు అంటున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్‌ను అవమానిస్తే మెదక్‌ను అవమానించినట్లే. ఈ ఎన్నికల్లో రేవంత్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి అని హరీశరావు సూచించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

దేశాన్ని పదేండ్లు పాలించిన బీజేపే ప్రజలకు ఏం మేలు చేసిందో చెప్పట్లేదు. 5 నెలల తన పాలనలో ఏం జరిగిందో రేవంత్ రెడ్డి కూడా చెప్పడం లేదు. తెలంగాణ ఏడు మండలాలను ఏపీలో కలిపేందుకు సహకరించిన బీజేపీకి కూడా గుణపాఠం నేర్పాలి. రాహుల్ గాంధీ ఆరు గ్యారెంటీలు అమలు అవుతున్నాయని చెప్పాడు. అవి అమలవుతున్న గ్రామాల్లోనే కాంగ్రెస్ వాళ్లు ఓట్లు అడగండి. అమలుకాని చోట ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేయండి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని తప్పుడు హామీ ఇచ్చినందకు కాంగ్రెస్ అధిష్టానం క్షమాపణ చెప్పాలి. వంద రోజుల్లో అమలు చేస్తామంటూ కాంగ్రెస్ రాసిచ్చిన బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయని హరీశ్‌రావు తెలిపారు.

మెదక్ జిల్లా ముద్దుబిడ్డ కేసీఆర్ ఉద్యమాన్ని మెదక్ నుండే ప్రారంభించారు. రాష్ట్రమంతా ఉద్యమం చేపట్టారు. ఓటుతో కాంగ్రెస్, బీజేపీలకు మెదక్ ప్రజలు గుణపాఠం చెబుతారు. బీజేపీ 10 సంవత్సరాల పాలనలో ఆదానీ, అంబానీలకు మేలు చేసింది తప్ప పేదవాడికి చేసిందేమీ లేదు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేటలను జిల్లాలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసింది కేసీఆర్. కాంగ్రెస్‌కు ఓటు వేయడం అంటే మన జిల్లాను మనం పోగొట్టుకోవడమే. ఉన్న జిల్లాలను పోగొట్టడానికి కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. మెదక్ బీజేపీ అభ్యర్థి గిమ్మిక్కులు, ఫేక్ వీడియోలతో ప్రచారం చేయబోతున్నాడు. ఫేక్ వీడియోలు, సోషల్ మీడియాలో బోగస్ ప్రచారాలు ప్రజలు నమ్మొద్దు. తప్పుడు వార్తలపై, బోగస్ సోషల్ మీడియా ప్రచారాలపై పటాన్‌చెరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాం. మెదక్ ప్రజలు నిజాలను గ్రహించి ఓటు వేయాలి అని హరీశ్‌రావు కోరారు.

# అబిడ్స్‌లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను పరిశీలించిన వికాస్ రాజ్

హైదరాబాద్, మే 6:పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు ముమ్మురం చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని సోమవారం అబిడ్స్‌లోని ఆల్ సెయింట్ హైస్కూల్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ పరిశీలించారు. పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్ల రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఓటింగ్ సరళి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతగా జరిగేలా చూడాలని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏవైనా సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.

# 12 ఎంపీ సీట్లు గెలిస్తే.. కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు : కేటీఆర్



కరీంనగర్, మే 6: పార్లమెంట్ ఎన్నికల్లో 12 సీట్లు గెలిస్తే.. కేసీఆర్ మళ్లీ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగా ఉండే అనుకునేటోళ్లు కారు గుర్తుకు ఓటేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని తంగళ్లపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతు కూలీలకు, కౌలు రౌతులకు పైసలిస్తా అని రేవంత్ రెడ్డి అన్నాడు. మహిళలకు రూ. 2500, ఇంట్లో పెద్ద మనుషులు ఇద్దరికీ రూ. 4 వేలు అన్నాడు. తులం బంగారం, స్కూటీలని రేవంత్ రెడ్డి చెప్పిండు. రంగుల కలలాంటి సినిమా చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ ఐదు నెలల్లోనే ప్రజలందరికీ అన్ని విషయాలు అర్థమయ్యాయి. అన్ని వర్గాలు కోపంగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన అబద్దాలనే ఇంకా చెబుతున్నారు. ఆరు గ్యారంటీల్లో ఐదు పూర్తి చేసినట్లు ఇప్పటికీ రేవంత్ రెడ్డి బొంకుతున్నాడు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు రుణమాఫీ విషయంలో తేదీలు మార్చుతుండు. దేవుడి మీద ఒట్లు?కేసీఆర్ మీద తిట్లు.. ఈ 4 నెలల్లో రేవంత్ రెడ్డి చేసింది ఇదే అని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలిసో తెలియకనో తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి..

తంగళ్లపల్లి ప్రజలకు నా మీద కోపం వచ్చినట్లు ఉంది. మొన్నటి ఎన్నికల్లో కొంచెం మెజార్టీ తగ్గించారు. నేను తెలిసో తెలియకనో తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి. కరెంట్ కోతలు, నీళ్ల కష్టాలు, బోనస్ సంగతి పక్కన పెట్టిండు, తంగళపల్లి బ్రిడ్జి కింద నీళ్లు లేకుండా చేశారు. బీజేపోళ్లు డైరెక్ట్‌గా 400 సీట్లు వస్తే మొత్తం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటున్నారు. ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలంటే కచ్చితంగా పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఉండాలె. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టింది. ఆయనను తంగళ్లపల్లి చౌరస్తాలో నిలబెడితే కాంగ్రెసోళ్లే గుర్తుపట్టరు అని కేటీఆర్ పేర్కొన్నారు.

మళ్లీ బీఆర్ఎస్ గెలవాలె.. తెలంగాణ పచ్చగా కళకళలాడాలె..

మన అవసరాలను కాదని గోదావరి నీళ్లను కర్ణాటక, తమిళనాడు మళ్లిస్తాడంట మోడీ. ఇలాంటి కుట్రలను ఎదుర్కొవటం బీజేపీ, కాంగ్రెస్ వాళ్ల తోని అయ్యే పని కాదు. జూన్ 2 తర్వాత హైదరాబాద్‌ను యూటీ చేయాలని బీజేపీ కుట్ర చేస్తోంది. ఇక పార్లమెంట్ స్థానాలకు ఒక్కటే జిల్లా ఉండాలని రేవంత్ రెడ్డి చెబుతుండు. జిల్లాలు రద్దు కాకుండా ఉండాలంటే దానికోసం కొట్లాడాలంటే బీఆర్ఎస్ లోక్ సభలో ఉండాలె. మనకు మనకు ఎన్ని గొడవలున్నా సరే వాటిని పక్కన పెట్టండి. సిరిసిల్లలో పదేళ్లు ఆత్మహత్యలు అనే మాట వినబడలే. మళ్లీ ఇప్పుడు నేతన్నల ఆత్మహత్యలు మొదలైనయ్. కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చింది. కరెంట్ లేదు. ఆత్మహత్యలు మొదలైనయ్. మళ్లీ బీఆర్ఎస్ గెలవాలె. తెలంగాణ పచ్చగా కళకళలాడాలె. ఉన్న నాలుగు రోజులు కష్టపడి ప్రచారం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఏపీ డీజీపీగా హరీశ్ గుప్తా బాధ్యతల స్వీకరణ



అమరావతి, మే 6:ఆంధ్రప్రదేశ్ డీజీపీగాహరీశ్ గుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ ఆదివారం వేటువేసిన విషయం తెలిసిందే. తక్షణమే ఆయనను బదిలీ చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీచేసింది. సోమవారం ఉదయం11 గంటల్లోగా ముగ్గురు డీజీ ర్యాంకు అధికారుల జాబితా పంపాలని ఆదేశించింది.

ఈసీ సూచన మేరకు కొత్త డీజీపీని నియమించేందుకు ముగ్గురి పేర్లతో కూడిన ప్యానెల్‌ను ఏపీ సర్కారు పంపింది. సీనియారిటీ జాబితాలో ఉన్న ఐపీఎస్ అధికారులు ద్వారకా ఆర్టీసీ ఎండీ తిరుమలరావుతో పాటు మాదిరెడ్డి ప్రతాప్, హరీశ్‌కుమార్ గుప్తా పేర్లను సిఫారసు చేసింది. ఈందులో హరీశ్ గుప్తాను డీజీపీగా ఈసీ ఎంపిక చేసింది.

# ఐదు ప్రాణాలు తీసిన అతివేగం.. ట్రాక్టర్ బోల్తాపడి ఐదుగురు మృతి

హైదరాబాద్, మే 6:అతివేగం ఐదు ప్రాణాలు తీసింది. వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో డ్రైవర్ సహా ఐదుగురు బాలురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో మరణించిన డ్రైవర్‌తోపాటు అందరూ మైనర్‌లే కావడం గమనార్హం. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ జిల్లాలోని చర్గవాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల తినేతా గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ధర్మేంద్ర ఠాకూర్ అనే 18 ఏళ్ల బాలుడు.. లక్కీ మార్కమ్ (10), అనూప్ బర్కడే (12), రాజ్‌వీర్ గోండ్ (13), దేవేంద్ర బర్కడే (15), దల్పత్ గోండ్ (12), వికాస్ ఉయ్‌కే (10) లను ట్రాక్టర్లో తీసుకుని చేను దగ్గరికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్‌ను వేగంగా నడపడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దల్పత్ గోండ్, వికాస్ ఉయ్‌కే మినహా మిగతా ఐదుగురు మరణించారు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఐదు మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఘటనపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

# ఖమ్మం ఎంపిస్థానానికి తెలంగాణ జనసమితి సమన్వయకర్తల నియామకం

ఖమ్మం, మే 6(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం ప్లారమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ గా గోపగాని శంకర్రావుతో పాటు 7శాసనసభా నియోజకవర్గాలకు తెలంగాణ జనసమితి పార్టీకి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటైన సమన్వయ కమిటీ సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ లను నియమించింది. సత్తుపల్లి-బి.బాబు, అశ్వారావుపేట- షేక్ నభీ సాహెబ్, కొత్తగూడెం-బి. దేవధానం. మధిర-సర్దార్ హుస్సేన్, పాలేరు-బెల్లంకొండ నాగేశ్వరరావు, ఖమ్మం-బట్టు రాజేందర్ నాయక్, వైరా-నునావత్ రవీందర్ నాయక్, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జులుగా తెలంగాణ ఉద్యమకారులను ప్రజాస్వామికవాదులను ప్రజాసంఘాలను కుల సంఘులు కలిసి ఎంపి అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిని అత్యధిక మేజార్జితో గెలిపించి అవీనీతీ మతతత్వ పార్టీలు అయిన బిఆర్ఎస్, బిజెపి పార్టీలను చిత్తు చిత్తుగా ఓడిస్తూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు.

